నెరవేరనున్న సొంతింటి కల

- పేదలకు వరంగా 'ఇందిరమ్మ ఇళ్లు'
- వేగంగా సాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులు

ఉప్పునుంతల: రాష్ట్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం వరంగా మారింది. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న కల నెరవేరనుంది. ఆర్థిక ఇబ్బందులతో ఇన్నేళ్లుగా కనీసం ఉండటానికి ఇంటిని నిర్మించుకోని స్థితిలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం కొండంత ధైర్యాన్ని ఇస్తుంది. మంజూరైన ఇళ్ల నిర్మాణాలు మూడు నెలల్లో పూర్తిచేసుకోవాలని అధికారులు చెబుతుండటంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా చేసుకుంటున్నారు. తాము ఉంటున్న పూరి గుడిసెలు, పాత ఇళ్లను తొలగించి వాటిస్థానంలో కొత్త ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయంతోపాటు తాము కొంత చేతి నుంచి వేసుకొని ఉన్నంతలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లను కట్టుకుంటున్నారు. ప్రస్తుతం పిల్లర్లు వేసుకొని బేస్‌మెంట్ పనులు స్థాయిలో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మండలంలో మొత్తం 427 ఇళ్లు మంజూరు కాగా 240 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. మిగిలిన వాటిని ప్రారంభించడానికి అధికారులు, స్థానికంగా ఉన్న నాయకులు కృషి చేస్తున్నారు.

పెరిగిన ఇంటి నిర్మాణం ఖర్చులు..

ఇంటి నిర్మాణ ఖర్చులు పెరిగిపోవడంతో ప్రభుత్వం ఇచ్చే ఆర్థికసాయం రూ. 5 లక్షలు ఏమాత్రం సరిపోని పరిస్థితి ఉందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 400ల చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల వరకు ఇంటి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్దేశించింది. ప్రస్తుతం మార్కెట్‌లో చదరపు అడుగుకు రూ. 310ల చొప్పున మేస్త్రీలు ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారు. తక్కువ సైజ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేస్తే తమకు కూలీ గిట్టుబాటు కాదని మేస్త్రీలు రూ. 2 లక్షల వరకు ఇస్తేనే పనులు చేస్తుండటం లబ్ధిదారులకు భారంగా మారింది. దీంతోపాటు సిమెంట్, స్టీల్ ధరలు ఎక్కువగానే ఉన్నాయి. ఇసుక సేకరణ లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది. ఇందిరమ్మ ఇళ్ల పేరిట రెవెన్యూ అధికారులు మండల సరిహద్దులోని దుందుభీ వాగు నుంచి ఇసుక సేకరణకు అనుమతి కూపన్లు ఇస్తున్నా ట్రాక్టర్ యజమానులు మాత్రం వాగు నుంచి 10 కిలోమీటర్ల దూరం ఉన్న ఉప్పునుంతలలోనే ఒక ట్రిప్పుకు రూ. 3500లకు ఇసుక వేస్తున్నారు. ఇక దూర గ్రామాలకు ఇసుక ట్రిప్పుకు రూ. 5వేల వరకు తీసుకుంటున్నారు. పాత ఇంటిని శిథిలాలను తొలగించి శుభ్రం చేయడంతోటు బేస్‌మెంట్ వరకు రూ. 2 లక్షల వరకు ఖర్చవుతుందని లబ్ధిదారులు అంటున్నారు.



ఉప్పునుంతలలో లబ్ధిదారులు చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

ఇసుక ఉచితంగా ఇవ్వాలి



పేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా ప్రభుత్వమే ఇస్తే బాగుంటుంది. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక అనుమతి పత్రాలు ఇస్తున్న ట్రాక్టర్ యజమానులు రూ. 3500లకు ట్రిప్పు వేస్తున్నారు. అది కూడా రోజుకు రెండు ట్రిప్పులకు అనుమతి ఇస్తే ఒక్క ట్రిప్పు కూడా రావడంలేదు. మేము ఇప్పటికే నాలుగు ట్రిప్పులు రూ. 4 వేలకు ట్రిప్పు చొప్పున కొనుకున్నాం.

– బీపాషాబేగం, లబ్ధిదారురాలు, ఉప్పునుంతల

సేకరణకు చర్యలు



మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం. మొత్తం ఇళ్లు 427 మంజూరుకాగా వాటిలో సగానికి పైగా నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల చివరి నాటికి మిగిలిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇసుక సేకరణ కోసం ఇంటి నిర్మాణ స్థాయిని బట్టి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పంచాయతీ కార్యదర్శి ద్వారా రెవెన్యూ అధికారులకు లెటర్ ఇప్పిస్తున్నాం.

– మోహన్‌లాల్, ఎంపీడీఓ, ఉప్పునుంతల

క్లుప్తంగా

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల నిరసన



అచ్చంపేట రూరల్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. నిధులు విడుదల చేసే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విజయ్, చరణ్, సమీర్, సాయి, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

కోడేరు: మండల కేంద్రంతో పాటు పస్పుల, జనుంపల్లి, తీగలపల్లి, నర్సాయిపల్లి, మైలారం తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం 8వ రోజు పీర్లను పురవీధుల గుండా ఊరేగించారు. సోమవారం నిమజ్జనం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పూజారి ఇస్మాయిల్, జహంగీర్ తెలిపారు.

పీర్ల పండుగ సందడి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు కొలువుదీరాయి. ఈ సందర్భంగా శనివారం యువకులు అలయ్‌బలయ్ ఆడారు. మహిళలు బొడ్డెమ్మలు వేశారు. ఆయా గ్రామాల్లో మొహర్రం సందడి కన్పించింది.

నిరుద్యోగుల అరెస్ట్ తగదు

కల్వకుర్తి రూరల్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సచివాలయం ముట్టడికి వెళ్తున్న నిరుద్యోగులను శుక్రవారం అరెస్ట్ చేయడాన్ని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు ఖండించారు. శనివారం కల్వకుర్తిలో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లతో కలిపి 60 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేశారని మిగిలిన 1,45,000 ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీనివాసులు, రామానుజన్, హుస్సేన్, పౌర్ణమి తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల విడుదల



కల్వకుర్తి రూరల్: పట్టణంలో వచ్చే నెల 1, 2వ తేదీల్లో నిర్వహించే సీపీఐ మూడో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఫయాజ్, వార్ల వెంకటయ్యలు కోరారు. శనివారం కల్వకుర్తిలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, బాల నరసింహులు హాజరవుతారని తెలిపారు. కొమ్ము భరత్, పులిజాల పరశురాములు, ధారదాసు, డాక్టర్ శ్రీనివాసులు, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గడ్డంపల్లికి చెందిన సాయి గ్రామం నుంచి నాగర్‌కర్నూల్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. , నాగర్‌కర్నూల్‌కు చెందిన కొండపల్లి కల్యాణ్ తెలకపల్లి వైపుకు బైక్‌పై వస్తున్నాడు. మార్గమధ్యలో గడ్డంపల్లి మూలమలుపు వద్ద ఎదురెదురుగా బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో కల్యాణ్‌కు తీవ్రగాయాలు, సాయి స్వల్ప గాయాలు అయినట్లు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

వాహనాల తనిఖీ

తాడూరు: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ సమీపాన ప్రధాన రోడ్డుపై శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గురుస్వామి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. వాహనానికి సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.

కలెక్టర్‌కు వినతి

నాగర్‌కర్నూల్ రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు అందజేయాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. లేని పక్షంలో సబ్‌స్టేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెద్దకొత్తపల్లి: ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కొల్లాపూర్ జూనియర్ సివిల్ జడ్జి దాము ఉపనిషద్వాణి అన్నారు. శనివారం సాతాపూర్‌లో లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు చిన్న, చిన్న తగాదాలు చోటుచేసుకున్నప్పుడు కోర్టును ఆశ్రయించకుండా గ్రామాల్లోనే లీగల్ సెల్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. పేదలు ఉచిత న్యాయ సలహా లీగల సెల్ ద్వారా పొందవచ్చన్నారు. పొలం, గట్ల పంచాయతీ, కుటుంబాల పంచాయతీలను కోర్టులు, పోలీస్‌స్టేషన్లను ఆశ్రయించకుండా గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గోపాల్‌రావు, నారాయణరావు, పరశురాముడు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ సతీష్, లోక్ అదాలత్ చైర్మన్ హరికృష్ణ, సిబ్బంది, న్యాయ సేవా సంఘం సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జడ్జి ఉపనిషద్వాణి

కస్తూర్బా పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్జి ఉపనిషద్వాణి హాజరై మాట్లాడారు. బాలికల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలస్వామి, రేణుక, ముబీన్, రాజు, మోహన్‌లాల్, నాగరాజు తదితర అడ్వకేట్లు పాల్గొన్నారు.

బయటపడిన ఈదమ్మ తల్లి విగ్రహం



అమ్రాబాద్: మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో శనివారం పురాతన ఈదమ్మ అమ్మవారి విగ్రహం బయటపడింది. ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని మెయిన్‌రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా యంత్రంతో రోడ్డును తవ్వుతుండగా విగ్రహం బయటపడింది. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. గతంలో ఈదమ్మ అమ్మవారి దేవాలయం అక్కడే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అమ్మవారికి గ్రామస్తులు పూజలు చేశారు.

భూగర్భ కేంద్రం సీఈకి సన్మానం



దోమలపెంట: శ్రీశైలం భూగర్భ కేంద్రం చీఫ్ ఇంజినీర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కేవీవీ సత్యనారాయణను శనివారం భూగర్భ కేంద్రం ఇంజినీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్లు ఘనంగా సత్కరించారు. ఇంజినీర్లు విజయ ఓబులాచారి, సందీప్‌కుమార్, రామ్మోహన్, అశ్విని, ఉద్యోగులు యాదయ్య, శివలక్ష్మి, సత్యనారాయణ, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం



అచ్చంపేట రూరల్: అమ్రాబాద్ మండలం మాధవానిపల్లి చెందిన సి. అంకిత ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. విషయం తెలుసుకున్న సుదర్శన్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ గార్లపాటి సుదర్శన్ విద్యార్థికి రూ. 30వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మహాత్మ జ్యోతిరావు పూలే ప్రిన్సిపాల్ రజిత పాల్గొన్నారు.

జర్నలిస్టుల దీక్షకు మాజీ ఎమ్మెల్యే సంఘీభావం



కొల్లాపూర్: పట్టణంలో టీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జర్నలిస్టులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. దీక్షకు కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ, సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. అనంతరం బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పట్టణం సమీపంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం స్థలం గుర్తించి, దానికి సంబంధించి ప్రొసీడింగ్స్ ఇప్పించానని గుర్తిచేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. దీక్షలు ప్రారంభమై 10 రోజులు గడుస్తున్నా మంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు.

కళాకారులకు సన్మానం



అచ్చంపేట రూరల్: మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్న యువకులను చైతన్యవంతం చేయడానికి నల్లమల రాగం అనే సంస్థ ద్వారా 'అరె సంజయ్ జర బంజెయ్ రా గంజాయి' పేరిట నల్లమల ప్రాంతానికి చెందిన కొందరు కళాకారులు వీడియో పాటను రూపొందించి ఇటీవల విడుదల చేశారు. శనివారం పట్టణంలో అంజనీమాత సేవాసమితి ఆధ్వర్యంలో కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంజనీమాత సేవాసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మండికారి బాలాజీ, అధ్యక్షురాలు సునీతాబాయి, ఇచ్‌డయాన్ హైస్కూల్ కరస్పాండెంట్లు కర్ణస్వామి, విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, కళాకారులు రమేష్, అనిత పాల్గొన్నారు.

సేవలతోనే జీవితం సార్థకత



కల్వకుర్తి రూరల్: సేవలతోనే జీవితం సార్థకత ఉంటుందని సీనియర్ జడ్జి శ్రీదేవి అన్నారు. పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్ హాల్లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ నేత్రాలయ సహకారంతో శనివారం ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. శిబిరంలో 800 మందికి పరీక్షలు నిర్వహించగా 35 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. 300 మందికి కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ సుంకిరెడ్డి చేస్తున్న సేవలు అందరికీ ఆదర్శమన్నారు. అనంతరం సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్లు పూర్తిగా ఉచితంగా చేస్తామన్నారు. వైద్యుడు దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పవన్‌కుమార్ రెడ్డి, బాలరాజు, రమేష్ ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

బిజినేపల్లి: గురుకులాలలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదులను, పరిసరాలను పరిశీలించారు. నిల్వ చేసిన ఆహార పదార్థాలను, ఆహారాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భోజనం నాణ్యతగా ఉందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గురుకులాలు అపరిశుభ్రంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ మున్నీరుద్దీన్, పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి తదితరులు ఉన్నారు.



బిజినేపల్లి గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

కొల్లాపూర్: ఈ నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ కార్మికులను కోరారు. శనివారం సివిల్ సప్లయ్ హమాలీలు గోదాం వద్ద అధికారులకు సమ్మె నోటీస్ అందించారు. కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీలు ఉన్నారు.

సీపీఎం మద్దతు

కల్వకుర్తి రూరల్: కార్మికుల సమస్యలపై దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.కేంద్రం ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. ఈ నెల 9న నిర్వహిస్తున్న సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మల్లయ్య, గున్నమ్మ, పరమేష్, మల్లారెడ్డి, శ్రీనివాసులు, రామరాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్వతాలు

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



వెల్దండ: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా శనివారం మండలంలోని రాచూర్, తిమ్మినోనిపల్లి తదితర గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను నాటించారు. అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలను పెంచి సిద్ధంగా ఉంచాలన్నారు. గుంతలను తీసి సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ క్రాంతి, ఉపాధి కూలీలు తదితరులు ఉన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

చారకొండ: సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల నాయకులు మోగిళ్ల కన్నా, చింతపల్లి కిరణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటల సమయం వరకు కార్యాలయంలో ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్‌లు మాత్రమే విధులకు హాజరయ్యారని తెలిపారు. తహసీల్దార్‌తో పాటు ఇతర అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యాలయం ఎదుట గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపించారు. జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విధులపై నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

తెలకపల్లి: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 8 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. మండలంలోని గౌరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎ రామాంజనేయులు, నిహారిక, చింటు, నందినిలతో పాటు కేకేరెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన ఫైజాన్ బాసర ట్రిపుల్ ఐటీకి అదేవిధంగా పెద్దపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్ శ్రీవాణి, పి.జశ్వంత్ బాసరకు, వసుంధర మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

బల్మూర్: మండలంలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులు అరుణ్‌కుమార్, మహేష్‌లు బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం విష్ణుమూర్తి తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఉప్పునుంతల: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన మండల కేంద్రానికి చెందిన నందిని అనే విద్యార్థిని బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

స్థానిక ఎన్నికలపై రేపు శిక్షణ

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల బూత్ స్థాయి అధికారులకు సోమవారం ఉదయం వైద్య కళాశాల ఉయ్యాలవాడలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉంటుందని పేర్కొన్నారు.

చెక్కు అందజేత

వీపనగండ్ల: సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.40వేల చెక్కును సంధ్యా కాశీనాథ్‌లకు శనివారం అందజేశారు.

అప్పాయపల్లికి స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం



లింగాల: మండలంలోని అప్పాయపల్లిలో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి పనులను బృందం సభ్యులు పరిశీలించారు. మురుగు కాల్వలు, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, అంగన్‌వాడీ, ఆరోగ్య ఉప కేంద్రాలను, ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకట్‌ప్రసాద్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ ఇమామలీ, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ ఊశన్న, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక



తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి సమీపంలో నర్సన్న గుట్టపై స్వయంభూ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేవస్థాన కమిటీ చైర్మన్‌గా నర్వ నరసింహారావు, అధ్యక్షుడిగా చిలుక భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా చిలుక రామచంద్రారెడ్డి, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా చిలుక సురేందర్‌రెడ్డి, చిలుక వివేక్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం స్వామివారి నిత్య పూజ నిధి కోసం దేవస్థాన కమిటీ చైర్మన్ నర్వ నరసింహారావు రూ.1.20 లక్షల చెక్కును ఆయన కమిటీ సభ్యులకు అందజేశారు.

పట్టణ అధ్యక్షుడిగా కురుమయ్య

కొల్లాపూర్: ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడిగా సంకటి కురుమయ్య మాదిగ, ప్రధాన కార్యదర్శిగా పసుపుల బాలయ్యలు ఎంపికయ్యారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల ఇన్‌చార్జ్ కొండూరు రాములు మాదిగ సమక్షంలో పట్టణ కమిటీని ఎంపికచేశారు. 7న మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరించాలని సూచించారు. సమావేశంలో నాయకులు బోరెల్లి సంఘం, మిద్దె కృష్ణయ్య, అగ్రస్వామి, పుట్టపాగ రాము, రవి, నాగరాజు, జగదీష్, విజయ్, మధు తదితరులు ఉన్నారు.

మృతదేహం అప్పగింత

తెలకపల్లి: మండలంలోని గౌరారంలో గ్రామ సమీపాన ఈ నెల 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన విషయం విధితమే. పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. లింగాల మండల బాకారం చెందిన దొరెడ్ల సారయ్య(46)గా గుర్తించారు. శనివారం ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

ఆలయ అభివృద్ధిపై సమీక్ష



తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి సమీపంలో అప్పాద్రి గుట్టపై విరాజిల్లుతున్న లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ అభివృద్ధిపై శనివారం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సమీక్ష నిర్వహించారు. దేవాలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఇతర ఖర్చులు, ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న దాతలు, శాశ్వత సభ్యులు, నిత్యపూజ నిధి సభ్యుల నుంచి స్వీకరించిన విరాళముల లెక్కలను సభ్యులు పరిశీలించి ఆమోదం తెలిపారు. ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడు చిలుక భాస్కర్‌రెడ్డి తెలిపారు.

సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్ రూరల్: సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుందని వారు పేర్కొన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. నాయకులు సత్యనారాయణ, రాజు, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.